## క్లుప్తంగా

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

భాగ్యనగర్‌కాలనీ: విద్యుత్ మరమ్మతుల కారణంగా జన్మభూమికాలనీ ఫీడర్ పరిధిలో గురువారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు విద్యుత్ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. జన్మభూమికాలనీ, దత్తాత్రేయకాలనీ, సుభాష్‌నగర్, మహంకాళినగర్, మొగుళమ్మ బస్తీ, ఖాజానగర్, ఎల్లమ్మబండ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మహంకాళినగర్, జర్నలిస్టు కాలనీ, పాపమ్మబస్తీ, ఎల్లమ్మబండ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో...**

మూసాపేట: బాలాజీనగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బాలాజీనగర్, వివేక్‌నగర్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఐడీఎల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**జలకన్య, వెంకటేశ్వరనగర్ ఫీడర్ల పరిధిలో...**

కూకట్‌పల్లి: జలకన్య ఫీడర్ పరిధిలోని తులసీనగర్, భూదేవిహిల్స్, ఆల్విన్‌కాలనీ, జలకన్య హోటల్ వెనుక వైపు ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు.. అదేవిధంగా వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో ఆర్‌పీకాలనీ, వెంకటేశ్వరనగర్, దీనబంధుకాలనీ, ఆల్విన్‌కాలనీ ఫేజ్–1 తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

### 17 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు

కూకట్‌పల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకొని కూకట్‌పల్లిలోని శ్రీద్వాదశ జ్యోతిర్లింగ భువనేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి తెలిపారు. ఈ మహాశివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలకు ముఖ్యఅతిథులుగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, బాలాజీనగర్ డివిజన్ కార్పొరేటర్ పగుడాల శిరీషబాబురావులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ శివరాత్రి మహోత్సవాలను ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అర్చకులు బ్రహ్మశ్రీ కె. గోపాల శర్మ పర్యవేక్షణలో ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

### ఆఫ్రీన్‌బేగంకు పీహెచ్‌డీ



రాయదుర్గం: మనూ పరిశోధక విద్యార్థినికి బుధవారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కామర్స్ విభాగంలో పరిశోధక విద్యార్థిని ఆఫ్రీన్ బేగం డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్‌లో అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎండి సాదత్‌షరీఫ్ పర్యవేక్షణలో 'ప్రభుత్వరంగంలో పెట్టుబడి ప్రవర్తన–ఉద్యోగులు–తెలంగాణకు సూచన' అనే అంశంపై థీసిస్ సమర్పించారు.

### అవసరమైతే మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

ఆల్విన్‌కాలనీ: అంధత్వ రహిత తెలంగాణ లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు ప్రారంభమైన రెండో విడత కంటి వెలుగు కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రజలను కంటి వెలుగు కేంద్రాలకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించాలని సూచించారు. అవసరమైతే ఎక్కువ మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. 100 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలందరికి వైద్యం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీ హాలు, రాం నరేష్‌నగర్ కమ్యూనిటీ హాలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలో పీజేఆర్ నగర్ కమ్యూనిటీ హాలు, వివేకానందనగర్ డివిజన్ పరిధిలో వెంకటేశ్వరనగర్ కాలనీలోని సగర సంఘం కమ్యూనిటి హాలులో, కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్ కమ్యూనిటీహాలులో కంటి వెలుగు శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు.

### తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

మియాపూర్: తప్పిపోయిన బాలుడిని వెతికి కుటుంబ సభ్యులు చందానగర్ పోలీసులు బుధవారం క్షేమంగా అప్పగించారు. ఎస్‌ఐ రఘు తెలిపిన వివరాల ప్రకారం.. శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ సమీపంలోని గుడిసెల్లో నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్, పోచమ్మ దంపతులకు కుమార్తె, కుమారుడు అఖిల్(2) ఉన్నారు. వీరు చెత్త ఏరుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారు. ఈ నెల 13వ తేదీ ఉదయం కుమారుడు అఖిల్‌ను నానమ్మ మాణిక్యమ్మ వద్ద ఉంచి పనికి వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి బాలుడు కనిపించలేదు. దీంతో 14వ తేదీ రాత్రి చందానగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సీసీ కెమెరాలను పరిశీలించగా చందానగర్‌లోని గంగారం ఆర్‌ఎస్ బ్రదర్ వద్ద బాలుడు అఖిల్ బుధవారం మధ్యాహ్నం కనిపించాడు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకురాగా ఎస్‌ఐ రఘు తల్లిదండ్రులకు అప్పగించారు.

## చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూముల కబ్జాకు పాల్పడితే చర్యలే..

- చెరువులో మట్టి పోస్తున్న వ్యక్తిని పట్టుకున్న అధికారులు
- కేసు నమోదు చేసి ట్రాక్టర్‌ను సీజ్ చేసిన పోలీసులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని గొలుసుకట్టు చెరువైన పరికి చెరువులో టిప్పర్లు, ట్రాక్టర్లతో వ్యర్థాలను తీసుకువచ్చి డంపింగ్ చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై సాక్షి పత్రికలో ప్రచురితమైన 'పరికి చెరువు కబ్జా!'అనే కథనానికి కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్ స్పందించారు. పరికి చెరువులో ట్రాక్టర్‌తో మట్టిని డంప్ చేస్తున్న వ్యక్తిని బుధవారం మండల ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పట్టుకున్నారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసులు నమోదు చేయించి ట్రాక్టర్‌ను సీజ్ చేశారు.

- ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.... చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములు కబ్జాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. భూకబ్జాదారుల నుంచి తక్కువ ధరకు వస్తున్నాయని కొనుగోస్తే వారిపై సైతం చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గతంలోనే చెరువు పరిసరాల్లో నిర్మించిన గదులను కూల్చివేశామని తెలిపారు. సాక్షిలో చెరువు కబ్జాపై కథనం ప్రచురితం కావడంతోనే అధికారులు స్పందిచారని 'సాక్షి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కథనానికి వెంటనే స్పందించిన మండలాధికారులు ట్రాక్టర్‌ను సీజ్ చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

సాక్షి ఎఫెక్ట్



పరికి చెరువులో మట్టిని డంపింగ్ చేసేందుకు వచ్చి ట్రాక్టర్‌ను సీజ్ చేసిన అధికారులు

## అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యం

**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ**



ఆల్విన్‌కాలనీ: అంధత్వ రహిత తెలంగాణే లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత కంటివెలుగు కార్యక్రమం ప్రారంభమైందని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు. కంటివెలుగు కేంద్రాల్లో మెడికల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో 8 మంది వైద్య సిబ్బంది ఉంటారని, ఒక ఆప్టో మెట్రిస్ట్, ఒక సూపర్‌వైజర్, ఇద్దరు ఏఎన్‌ఎం, ముగ్గురు ఆశా, 1 డీఈవో టీంలో సభ్యులుగా ఉంటారన్నారు.

- కంటివెలుగు సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు. కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యమై ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్కువ మంది జనాభా ఉన్న ప్రాంతాల్లో మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు.
- ఈ కంటివెలుగు కేంద్రంలో ఉచిత వైద్యంతో పాటు అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేస్తారని అన్నారు. అదే విధంగా అవసరమైన వారికి ఆపరేషన్లు కూడా చేస్తారని పేర్కొన్నారు. ఈ పథకం దేశానికే ఆదర్శమన్నారు. ఈ బృహత్తర కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు.
- హైదర్‌నగర్ డివిజన్ పరిధలోని హెచ్‌ఎంటీ హిల్స్ కమ్యూనిటీహాల్, రాంనరేష్ నగర్ కమ్యూనిటీ హాలు, ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలని పీజేఆర్‌నగర్ కమ్యూనిటీ హాలు, వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్ కాలనీలోని సగర సంఘం కమ్యూనిటీహాలులో, కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని కమ్యూనిటీహాలులో కంటివెలుగు శిబిరాలు నిర్వహించారు.

## బీజేపీ అధికారంలోకి వచ్చాక హామీలన్నీ నెరవేరుస్తాం

**– పాదయాత్రలో గజ్జల యోగానంద్**

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్‌లోని కృష్ణవేని కాలనీ, ప్రశాంతినగర్, శ్రీరామ్‌నగర్ కాలనీల్లో బుధవారం బీజేపీ సీనియర్‌నాయకుడు గజ్జల యోగానంద్ పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ ఎన్నికల సమయంలో ఉచిత తాగునీరు ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. ఉచిత నీరు అటుంచితే అసలు నీళ్ల రాని పరిస్థితి కొన్ని కాలనీల్లో ఉందన్నారు. కొన్ని కాలనీల్లో డ్రైనేజీ బ్లాక్ అవటంతో మురుగు రోడ్లపై పారుతోందన్నారు. దీంతో కలుషిత తాగునీరు సరఫరా అవుతోందని తెలిపారు. రాత్రి వేళల్లో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. ఫాగింగ్ కూడా చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం వచ్చి ఎనిమిదేళ్లయినా ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో విజిత్‌వర్మ, వెలగ శ్రీనివాస్, నవీన్‌గౌడ్, మనోహర్, శేషయ్య, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.



హైదర్‌నగర్ డివిజన్‌లో సమస్యలను పరిశీలిస్తున్న గజ్జల యోగానంద్, బీజేపీ నాయకులు

## ఇంటింటికీ హాత్‌సే హాత్ జోడో యాత్ర



కూకట్‌పల్లిలో జరిగిన యాత్రలో పాల్గొన్న గొట్టిముక్కల వెంగళరావు తదితరులు

కూకట్‌పల్లి: ఏఐసీసీ ఆదేశాల మేరకు రెండోరోజు హాత్ సే హాత్ జోడో యాత్రను ఇంటింటికి బుధవారం కూకట్‌పల్లిలో డివిజన్ అధ్యక్షుడు మేకల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు పాల్గొని రాహుల్‌గాంధీ జోడో యాత్ర సందేశంతో కూడిన కరపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ స్టేట్ జనరల్ సెక్రటరీ మిస్బా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు



బాలాజీనగర్‌లో సేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలో సేవాలాల్ మహరాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బుధవారం బాలాజీనగర్‌లో జరిగిన వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష బాబూరావులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన సేవలను స్మరించుకున్నారు. బంజారా, లంబాడా కమ్యూనిటీ ఆరాధ్య దైవమని అన్నారు.

- అదే విధంగా అల్లాపూర్ డివిజన్‌లోని పర్వత్ నగర్ మినీ ఫంక్షన్‌హాలులో ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సబిహా బేగం హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్రినాయక్, జీఎస్ సెక్రటరీ భాస్కర్‌నాయక్, గోపాల్ నాయక్, కళ్యాణ్ నాయక్, బాబా, జ్ఞానేశ్వర్, విష్ణు, ఇస్మాయిల్, రవీందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## మైక్రో కేర్ ఆసుపత్రి వైద్యుల ఘనత



శస్త్ర చికిత్స అనంతరం విజయ సంకేతం చూపిస్తున్న మైక్రోకేర్ ఆసుపత్రి వైద్యులు

- పుట్టుకతోనే పూర్తి వినికిడి లోపం
- విజయవంతంగా శస్త్రచికిత్స చేసిన వైద్యులు

కూకట్‌పల్లి: పుట్టుకతోనే పూర్తి వినికిడి లోపంతో పుట్టిన ముగ్గురికి కేపీహెచ్‌బీకాలనీలోని మైక్రో కేర్ ఆసుపత్రిలో విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల చీఫ్ డాక్టర్ విన్నకోట ప్రకాష్ మాట్లాడుతూ... ప్రపంచంలోనే అరుదుగా జరిగే శస్త్ర చికిత్సల్లో ఒకటైన కోచ్‌లేర్ ఇంప్లాంట్ సర్జరీని మైక్రోకేర్ ఈఎన్‌టీ హాస్పటల్‌లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. అతి పేద దేశమైన సూడాన్‌కు చెందిన ముగ్గురు అన్నదమ్ములకి మూడు రోజుల పాటు ఈ సర్జరీని చేశామన్నారు. పుట్టు మూగ, చెవిటి సమస్యని సమూలంగా రూపుమాపే ఆధునిక వైద్యం కోచ్‌లేర్ అని చెప్పటంలో అతిశయోక్తి లేదన్నారు. ఇప్పుడే పుట్టిన పిల్లలకి వినికిడి పరీక్షలు చేయించి వారికి వినికిడి సమ్య ఉన్నట్లయితే ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా ఈఎన్‌టీ వైద్యులకు చూపించి వారి సూచనల మేరకు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. మైక్రోకేర్ ఈఎన్‌టీ హాస్పటల్ సిబ్బంది ఇటువంటి అరుదైన సర్జరీ చేయడానికి తగిన నైపుణ్యంతో అందుకు కావలసిన ప్రపంచ స్థాయి ఆధునిక వైద్య సదుపాయాలతో సిద్ధంగా ఉందన్నారు.

## కీసరగుట్టకు శానిటేషన్ సిబ్బంది



శివరాత్రి పండుగ సందర్భంగా కీసరగుట్టలో ప్రత్యేక శానిటేషన్ కోసం కూకట్‌పల్లి మూసాపేట సర్కిల్ నుంచి కార్మికులకు అక్కడ పని చేయడానికి పంపించారు. దీంతో బుధవారం వారు కీసరగుట్టకు బయల్దేరారు.– మూసాపేట

## తెలంగాణ సాయుధ పోరాట యోధుడు ధర్మభిక్షం



ఘనంగా మాజీ ఎంపీ ధర్మభిక్ష జయంతి

జగద్గిరిగుట్ట: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ ధర్మ భిక్షం జయంతిని బుధవారం మగ్దూంనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుత్బుల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి దుర్గయ్య మాట్లాడుతూ... ధర్మభిక్షం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతరం ఉద్యమాన్ని నడిపిన వీరుడన్నారు. స్వతంత్ర పోరాటంలో జైలుకు వెళ్లడంతో పాటు తెలంగాణ సాయుధ ఉద్యమానికి నాయకత్వం వహించారని కొనియాడారు. విద్యార్థుల కోసం భిక్షం అడుక్కుంటూ హాస్టల్ స్థాపించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ పేద విద్యార్థులకు విద్యను కల్పించడం వల్లనే ఆయనకు ధర్మభిక్షం అని పేరు వచ్చిందన్నారు.

- పార్లమెంట్ ఎన్నికల్లో 200 మందికి పైగా పోటీ చేస్తే ప్రజలు ధర్మభిక్షానికే ఓటు వేసి గెల్పించారని గుర్తు చేశారు. అది ఆయన గొప్పతనానికి నిదర్శనమని అన్నారు. రాష్ట్రంలో కల్లు గీత కార్మికుల కోసం సహకార సంఘాల ఏర్పాటు.. తాటి వనాల పెంపకం, ప్రమాదానికి గురైతే ప్రభుత్వం నుంచి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని పోరాటం చేసి సాధించిన పెట్టిన ఘనత ధర్మభిక్షానికే చెందుతుందన్నారు. నేడు పార్టీలకు అతీతంగా గౌడ కులస్తులు ఆయనను స్మరించుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన చివరి వరకు కమ్యూనిస్టుగానే ఉండి ప్రజాసేవ చేశారని తెలిపారు.
- మగ్దూమ్‌నగర్ శాఖ కార్యదర్శి సుధాకర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో భారత జాతీయ మహిళ సమాఖ్య మండల కార్యదర్శి హైమావతి, సత్యవతి, ఏఐవైఎఫ్ అధ్యక్షుడు సంతోష్ , సీపీఐ మండల కార్యవర్గ సభ్యులు సదానాథ్, కృష్ణ, ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి శివ, అధ్యక్షుడు వరుణ్, నరేంద్రచారి, చంద్రయ్య, యాదగిరి, సందీప్, సాయులు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ శక్తి కేంద్రాల సమావేశం




సమావేశంలో మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

మియాపూర్: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని పాపిరెడ్డి కాలనీలో ప్రజాగోస– బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రాల కార్నర్ సమావేశంను బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా మాజీ పార్లమెంట్ సభ్యుడు బూర నర్సయ్యగౌడ్ హాజరై మాట్లాడుతూ... నియోజకవర్గంలో గత 9 సంవత్సరాల్లో ఎమ్మెల్యే గాంధీ ప్రభుత్వ స్థలాలు, చెరువుల కబ్జాలకు పాల్పడడం తప్ప చేసిందేమీలేదని ఎద్దేవా చేశారు. పాపిరెడ్డి కాలనీలో బెల్ట్ షాపులు చాలా ఉన్నాయని వాటిని తొందర్లోనే మూసి వేయిద్దామన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి పథకాలను నాయకులు, కార్యకర్తలు అందరూ ప్రజలకు అందే విదంగా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రవికుమార్ యాదవ్, అసెంబ్లీ కన్వీనర్ రాఘవేంద్రరావు, నాయకులు ఎల్లేష్, రాజుశెట్టి అనిల్‌కుమార్, రమేష్, శక్తి కేంద్రాల ఇంచార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతిలో మెరుగైన ఫలితాలు రాబట్టాలి



రాయదుర్గం: ఈ విద్యాసంవత్సరం పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు వచ్చేలా చూడాలని రాష్ట్ర సమగ్ర శిక్ష జాయింట్ డైరెక్టర్ పి రాజీవ్ ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, ఉపాధ్యాయుల బోధన, విద్యను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పదవ తరగతిలో మెరుగైన ఫలితాలు రావడానికి తగిన ప్రణాళికను రూపొందించుకొని ముందుకుసాగాలన్నారు. అంతకుముందు ప్రాక్టీస్ పేపర్స్ పరిశీలించారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తాజ్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ వివాదాలు త్వరగా పరిష్కారమయ్యేలా చూడాలి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి పరిధిలోని భూముల రిజిస్ట్రేషన్, గృహ నిర్మాణ అనుమతులు, యూఎల్‌సీ సమస్యలు, భూవివాదాల పరిష్కారానికి విధానపరమైన నిర్ణయాలలో జరుగుతున్న జాప్యాన్ని తొలగించి గృహ నిర్మాణ అనుమతులకు, ఇంటి రిజిస్ట్రేషన్‌ల అనుమతులు లభించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కోరారు.ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిలోని పేద, మధ్య తరగతి ప్రజలను దృష్టిలో పెట్టుకొని జీఓ నంబర్ 59 ద్వారా స్థలాల క్రమబద్ధీకరణలో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుము భారం కాకుండా ఒకే సర్వే నంబర్‌లో ఒకే విధంగా చెల్లించేటట్లుగా ఆదేశాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు.పాపిరెడ్డినగర్‌లో ఏబ్లాక్ 6వేలు చెల్లించాల్సి ఉండగా సీ బ్లాక్‌లో రూ.10వేలు చెల్లించాలని జారీ చేసిన ఉత్తర్వులను పరిశీలించి న్యాయబద్ధంగా రుసుము విధించాలని కోరారు. శేరిలింగంపల్లిలోని పలు ప్రాంతాలలో యూఎల్‌సీ క్లియరెన్స్, రిజిస్ట్రేషన్ సమస్యలు, గోకుల్ ఫ్లాట్స్, రాంనరేష్‌నగర్, ప్రశాంత్‌నగర్, బికే ఎన్‌క్లేవ్ కాలనీలో రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆమె సానుకూలంగా తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

## అధిక డబ్బు ఆశ చూపి మోసం

- నాలుగింతలు అధికంగా ఇస్తామంటూ పెట్టుబడుల వసూలు
- అసలుకే ఎసరు పెట్టిన కంపెనీ ఎదుట బాధితుల ఆందోళన

కేపీహెచ్‌బీకాలనీ: కొత్తగా ఉద్యోగంలో చేరేందుకు వచ్చే యువతను లక్ష్యంగా చేసుకొని వారికి అధిక వేతనాలు ఆశ చూపి ఉద్యోగంలో చేరిన వారితోనే ఆ కంపెనీలో లక్షల్లో పెట్టుబడులు పెట్టించి మోసాలకు పాల్పడుతున్న ఓ కంపెనీ బాగోతం ఆలస్యంగా వెలుగు చూసింది. ఉద్యోగులుగా తాము పెట్టుబడులు పెట్టడంతో పాటు తమకు తెలిసిన వారితోనూ లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టించి మోసపోయిన ఉద్యోగులు కొందరు బుధవారం కంపెనీ ఆవరణలో ఆందోళనకు దిగారు.

- కేపీహెచ్‌బీ కాలనీలోని ఎక్స్‌సీఎస్‌పీఎల్ కంపెనీ నిర్వాహకులు ఔత్సాహిక యువతకు అధిక వేతనాలు ఆశ చూపించి ఉద్యోగాలు ఇచ్చి తిరిగి వారి నుంచే ఆ కంపెనీలో డబ్బులు పెట్టుబడులు పెట్టించేవారు. ఒకటికి నాలుగు రెట్లు అధిక మొత్తంలో తిరిగి సంవత్సరకాలం దాటినా వెంటనే చెల్లిస్తామని నమ్మించారు. దీంతో ఉద్యోగంలో చేరిన ప్రతి ఒక్కరూ తమ సొంతంగాను, వారి బంధువులు, తెలిసిన వ్యక్తుల ద్వారాను లక్షల్లో పెట్టుబడులు పెట్టించారు. అయితే వారికి తిరిగి డబ్బులు ఇవ్వకపోగా అడిగిన వారిని బెదిరింపులకు గురి చేశారు.
- దీంతో గత నవంబర్ 8న 18 మంది ఉద్యోగులు కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి సుమారు 50 లక్షలు పెట్టుబడిగా పెట్టించి మోసపోయామని ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులైన సంస్థ నిర్వాహకులు పాశం వెంకట ప్రసాదు, శివకుమార్‌గౌడ్, అనిల్‌కుమార్, కొండూరు వెంకటేశ్‌లపై కేసు నమోదు చేశారు.



కేపీహెచ్‌బీ కాలనీలోని ఎక్స్‌సీఎస్‌పీఎల్ కంపెనీ వద్ద తమకు న్యాయం చేయాలని వచ్చిన బాధితులు

- అయితే మోసానికి పాల్పడిన సంస్థ నిర్వాహకులు యథేచ్ఛగా తిరిగి సంస్థను నడుపుతూ ఇంకా కొత్తగా యువతకు ఉద్యోగాలు ఇస్తూ అదే మోసానికి పాల్పడుతున్నా ప్రభుత్వం, పోలీసులు చూస్తూ ఉన్నారని, వారిని అడ్డుకోలేకపోతున్నారని కాశీవిశ్వనాథ్ అనే బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.
- బుధవారం మరి కొందరు బాధితులతో సంస్థ ప్రాంగణానికి వచ్చి తమకు న్యాయం చేయాలని మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు మాత్రం కేసు కోర్టులో ఉందని తామేమీ చేయలేమని పేర్కొనడం గమనార్హం.

## యజమాని దాడి చేయటంతోనే బస్సులను తగలబెట్టాడు

- నిందితుడిని పట్టుకున్న పోలీసులు
- నేరం ఒప్పుకోవడంతో డ్రైవర్ రిమాండ్
- బస్సు యజమాని, దాడి చేసిన వ్యక్తిపై డ్రైవర్ ఫిర్యాదు
- వారిపై సైతం కేసు నమోదు చేసిన పోలీసులు



బస్సులను తగలబెట్టిన నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ చంద్రశేఖర్, సీఐ నర్సింగ్‌రావు



బస్సులను తగలబెట్టిన నిందితుడు వీరబాబు

భాగ్యనగర్‌కాలనీ: ట్రావెల్స్ యజమానితో పాటు అతని సోదరుడు తనపై విచక్షణారహితంగా దాడి చేసినందుకే బస్సులను తగలబెట్టిన వ్యక్తిని కూకట్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. కూకట్‌పల్లి ఏసీపీ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ కృష్ణాజిల్లాకు చెందిన పసుపులేటి వీరబాబు (35) రెండు నెలలుగా గ్యారెజీలోనే నివాసముంటూ భారతి ట్రావెల్స్‌లో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 12వ తేదీన ట్రిప్పుకు వెళ్లాలని భారతి ట్రావెల్స్ యజమాని కృష్ణారెడ్డి అతని సోదరుని కుమారుడు యశ్వంత్‌రెడ్డి అతడికి సూచించారు. తాను ట్రిప్పుకు వెళ్లలేనని తన స్వగ్రామానికి వెళుతున్నానని చెప్పాడు.

- దీంతో కోపోద్రిక్తులైన బస్సు యజమాని డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. అంతటితో ఆగకుండా బస్సు యజమాని కృష్ణారెడ్డి సోదరుని కుమారుడు యశ్వంత్‌రెడ్డి గ్యారేజిలోని ఒక రూముకు తీసుకెళ్లి అతనిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా కొట్టడంతో సహనం కోల్పోయిన వీరబాబు తన యజమానికి నష్టం కలిగించాలనే ఉద్దేశంతో బస్సులకు నిప్పుపెట్టాడు.
- ఈ క్రమంలోనే ఓ పెట్రోల్ బంక్‌లో 2 లీటర్ల పెట్రోల్ కొనుగోలు చేసి అదే రోజు రాత్రి 12 గంటల సమయంలో గ్యారేజీకి చేరుకొని బస్సుపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. దీంతో పక్కనే ఉన్న మరో రెండు బస్సులకు నిప్పంటుకుని దగ్ధమయ్యాయి. బస్సు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.
- సీసీ ఫుటేజీ ఆధారంగా వీరబాబు బస్సులను తగల బెట్టినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు వీరబాబును అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించటంతో బుధవారం రిమాండ్‌కు తరలించారు.

**యజమానిపై డ్రైవర్ ఫిర్యాదు...**

అయితే తనను విచక్షణారహితంగా దాడి చేయటంతోనే డ్రైవర్ వీరబాబు బస్సు యజమాని కృష్ణారెడ్డి, అతని సోదరుని కుమారుడు యశ్వంత్‌రెడ్డిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా వారిరువురిపై కూడా కేసు నమోదైనట్లు పోలీసులు పేర్కొన్నారు.